

స్పందనకు 90 దరఖాస్తులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్థానిక కలెక్టరేట్‌ను సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై అర్జీదారుల నుంచి 90దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ ఆధ్వర్యాన జరిగిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే వికలాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కలెక్టరేట్ కిందభాగంలో ప్రత్యేకంగా స్పందన కార్యక్రమం జరిగింది. డిఆర్ఒ జె.వెంకట్రావు బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

- కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా
- కనీస వేతనాలు అమలు చేసే వరకూ పోరాటం
- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకుల హెచ్చరిక

సమస్యల పరిష్కారానికి..

కదంతొక్కిన అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - కలెక్టరేట్

కనీస వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూట్ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని, తదితర సమస్యలు పరిష్కారం కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం వేలాదిమంది అంగన్వాడీలు ధర్నా చేశారు. ఉదయం 10గంటలకే జిల్లా వ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు చేరుకొని నిరసన తెలిపారు. ఈ నిరసననుద్దేశించి ఉద్దేశించి ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సరళ కుమారి, ప్రధాన కార్యదర్శి గంట జ్యోతి మాట్లాడుతూ జిల్లాలోనే అనేక అంగన్వాడీ కేంద్రాల్లో కనీస మౌలిక వసతుల్లేవని, కొన్ని కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం లేక చిన్నపిల్లలు, బాలింతలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ సౌకర్యం ఉన్న కేంద్రాలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలేదన్నారు. ఐదేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించలేదన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6 నెలల నుంచి బిల్లులు చెల్లించలేదన్నారు. దీని వల్ల అప్పులుచేసి లబ్దిదారులకు ఆహారం వండిపెడుతున్నారన్నారని, దీంతో అంగన్వాడీలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పనిభారం పెంచారు కానీ వేతనాలు పెంచలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సరిగా పని చేయకపోవడంతో విధుల పరంగా అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఫేస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు తప్ప తన సమస్యలను గుర్తించి వాటికి తగిన ప్రత్యామ్నాయ పద్ధతులను సూచించే ఆలోచన చేయడం లేదని విమర్శించారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ కేంద్రాల బలోపేతానికి నిధులు పెంచి అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల పర్యవేక్షణకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె, తహశీల్దార్, ఎంపిడిఒ, రాజకీయ నాయకులు ఇలా అనేక మంది తనిఖీ పేరిట అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలౌతున్నారన్నారని, ఇటీవల రాజమండ్రిలో అంగన్ వర్కర్ ఆ కేంద్రంలోనే గుండెపోటుతో మరణించారని గుర్తు చేశారు. ఇప్పటికే కొన్ని చోట్లకొంత మంది అంగన్వాడీలు రాజీనామాకు సిద్ధపడుతున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై పనిభారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాక్షులు దావాలా రమణారావు, యమ్మల మన్మధరావు, వి.ఇందిర మాట్లాడుతూ వైయస్సార్ సంపూర్ణపోషణ అమలు చేస్తున్నా మెనూకు తగిన విధంగా ఛార్జీలు సరుకుల క్వాంటీ పెంచలేదన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలను, గ్యాసును ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50ఏళ్లు పెంచాలని, ప్రమోషన్లో రాజకీయ జోక్యం అరికట్టాలని, 300 జనాబా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ సెంటర్లోని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకోవాలని, జాబ్ క్యాలండర్ నిర్ణయించాలని బకాయి జీతం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి అమరవేణి, జిల్లా సభ్యులు దాలమ్మ, నారాయణమ్మ, రాధ, హిమప్రభ, ప్రభావతి, సత్యవతి, గౌరమ్మ, ధర్మవతి, దర్శిని, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, జిల్లాలోని వేలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిల్లు కొడితే చేతులు తడపాల్సిందే

అక్రమాలకు పాల్పడుతున్న ఉపఖజానా శాఖాధికారులు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ఆ కార్యాలయానికి వెళ్లని ఉద్యోగులు ఉండరు, కాంట్రాక్టర్లు ఉండరు, సాంకేతిక పరంగా ఎంతో ఆధునీకరించిన ఆ శాఖాధికారులు మాత్రం కొర్రీలు పెట్టకమానరు. చేతులు తడిపితేనే బిల్లులు ఆమోదించే పరిస్థితి అక్కడ కనిపిస్తుంది. అదెక్కడో కాదు పాలకొండ ఉపఖజానాశాఖ కార్యాలయంలోనే.. ఎంతటివారైనా అక్కడకు వెళ్లి చేతులు తడిపితేనే పనులు జరుగుతాయి. దీనిపై ఉద్యోగులు, కాంట్రాక్టర్లు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. చేసేదేమి లేక వారు అడిగినంత చెల్లించి పనులు చేయించుకుంటున్నారు. పాలకొండ ఉపఖజానా శాఖ పరిధిలో పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాలున్నాయి. ఈ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాలతో పాటు పెన్షనర్ల భత్యాలతో పాటు కాంట్రాక్టర్లు చేపడుతున్న పనులకు బిల్లులు ఈ కార్యాలయంలోనే ఆమోదించాల్సి ఉంది. సుమారు 5వేల మంది ఉద్యోగులతో పాటు 1700 మంది పెన్షనర్లు ఉన్నారు. అయితే వీరు జీతభత్యాల బిల్లులు పెట్టినప్పుడు ఐడిలు నమోదు చేసినప్పుడు కచ్చితంగా ఉపఖజానా శాఖాధికారులను కలిసి చేతులు తడపాల్సిన పరిస్థితి ఉంటుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ శాఖలో అవినీతి, అక్రమాలకు కొదువు లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఉద్యోగులు ఐడిలు నమోదుతో పాటు ఉద్యోగ విరమణ చెందిన వారి భత్యాలు బిల్లుల్లో కూడా వీరు పలు అక్రమాలకు పాల్పడుతున్నట్టు పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా కాంట్రాక్టులు చేపడుతున్న పనుల్లో కనీసం 2శాతం అయినా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవలే రీసర్వేకు కొత్తగా నియమితులైన డిప్యూటీ తహశీల్దార్లు ఐడిలు నమోదుకు కాసులు అడుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి విషయంలో కూడా కాసులకు కక్కుర్తి పడుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ధాన్యం కొనాలని

పెట్రోల్‌తో రైతుల ఆందోళన

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాని కోరుతూ పెట్రోలు బాటిల్స్‌తో ఆందోళనకు దిగారు. గత 25 రోజులు నుండి ధాన్యం కొనమంటే అధికారులు తిప్పుతున్నారే తప్ప కొనుగోలు చేయడం లేదని పొలంలో చలిలో ధాన్యం బస్తాలు వద్ద కాపలా ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధ ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. అధికారులు 100 టన్నులు కొనుగోలు చేస్తామంటున్నారని మిగతా 500 టన్నులు ధాన్యం ఏమి చేసుకోవాలని నిలదీశారు. ప్రభుత్వం కన్నా దళారులే నయమని తక్కువకు తీసుకున్నా వెంటనే డబ్బులు చెల్లించేస్తారని చెప్పారు. దాన్యం కొనుగోలు చేసే దాక ఆందోళన విరమించేది లేదని రైతులు బైటాయించారు. ధాన్యం విక్రయాలు జరగకపోవడంతో చేతిలో చిల్లి గవ్వలేదని, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక బతుకు భారంగా మారిందని వాపోయారు. రకరకాల పథకాలతో ఇతరులకు డబ్బులు జమ చేస్తున్న ప్రభుత్వానికి కష్టపడి పంటలు పండించిన రైతులు కనిపించకపోవడం సిగ్గుచేటన్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలనీ లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిటికి తమ సమస్యను వివరించారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ సీసాలతో ఆందోళన చేస్తున్న రైతులు

సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం : బొబ్బిలి కోర్టులో సేవలందించేందుకు గాను స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నియామకానికి అనుభవజ్ఞులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ్ చక్రవర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హైకోర్టు పరిధిలో సేవలందించిన వారు, ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో గెజిటెడ్ హోదాలో పని చేసి రిటైర్ అయిన వారు, న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో సేవలందించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల17 లోగా నమూనా ప్రకారం దరఖాస్తుల పూర్తి చేసి జిల్లా కోర్టులో అందజేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్



ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలి : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

మండల అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు ఎక్కువగా చేయాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. పర్యవేక్షణ చేయడం వల్ల పనులు వేగవంతమవుతాయని చెప్పారు. మండల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో 200 టవర్ల నిర్మాణానికి వెంటనే స్థలాలను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రీ సర్వేలో అందరూ ఫారం-8 జనరేట్ చేయాలని సూచించారు. పాలకొండ, బలిజిపేట, సీతానగరం, మక్కువ మండలాల్లో పట్టాల పంపిణీ జాప్యం జరుగుతోందని, త్వరితగతిన చేయాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణాల ప్రగతిలో సీతానగరం, కొమరాడ మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ఇది సరైన సమయమని, లబ్ధిదారులను సమాయత్తం చేయాలని ఆయన సూచించారు. సాలూరు, పాలకొండ పట్టణ గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఉపాధి హామీ చట్టం కింద 1.50 కోట్ల పని దినాలు కల్పించాలని లక్ష్యమని, అందుకు తగిన విధంగా పనులు గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు. అమత్ సరోవర్ పనులు చేపట్టాలని దానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కనీస వేతనం రూ.200 రావాలని, అందుకు వేతనదారులు పనులు చేయుటకు కొలతలు ఇవ్వాలని ఆయన అన్నారు. ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ నాడు నేడు పనులపై ఎంపిడిఒలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీరాజ్ ఎస్ఇ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అందిన పనులను చేపట్టడం, వాటి బిల్లులు అప్ లోడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ జె.శాంతీశ్వర రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకర రావు, ఇన్‌ఛార్జి డిఇఒ పి.బ్రహ్మాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో కేర్ ట్రాకర్ మృతి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని పసుకుడి గ్రామం సమీపాన వంశధార తీరప్రాంతంలో ఏనుగుల దాడిలో లోకుండ లక్ష్మీనారాయణ(25) అనే ఎలిఫెంట్ కేర్ ట్రాకర్ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి 7.30గంటలకు చోటు చేసుకుంది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఐ.హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం లోకుండ లక్ష్మీనారాయణ ఐదేళ్లుగా ఎలిఫెంట్ కేర్ ట్రాకర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సెలువుపై వెళ్లిన లక్ష్మీనారాయణ సోమవారం విధుల్లోకి వచ్చాడు. వచ్చిన రోజే సాయంత్రం ఏనుగుల తరలించే క్రమంలో జారిపడిపోయాయి. దీంతో నాలుగు ఏనుగులు ఒకేసారి దాడి చేయడంతో చనిపోయాడని తెలిపారు. మతుడి స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం తిడ్డిమి. గత కొన్ని రోజులుగా 13 మంది ఎలిఫెంట్ కేర్ ట్రాకర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఏనుగుల దాడిలో సహచరుడు చనిపోవడంతో తోటి సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు.



ఏనుగుల దాడిలో మృతి చెందిన లక్ష్మీనారాయణ

మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి పనులు వేగవంతం

ప్రజాశక్తి - సీతంపేట

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిందని, గిరిజన ఓట్లుతో గెలిచిన ప్రభుత్వం, ఎమ్మెల్యే హామీలను నెరవేర్చలేదని పాలకొండ నియోజకవర్గ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీతంపేట మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పునాదులు కూడా దాటలేదన్నారు. అలాగే గిరిజన యూనివర్సిటీ పనులు కూడా పునాదులకే పరిమితమయ్యావని అన్నారు. వెంటనే ఈ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎలో నిధుల్లేక నిర్వీర్యంగా మారిందన్నారు. వేసవి వచ్చినప్పటికీ తాగునీటి సమస్య వెంటాడుతుందన్నారు. ఫీడర్ అంబులెన్స్‌లు మూలన పడి ఉన్నాయని గిరిజనులకు వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఏనుగులు వల్ల ఇప్పటికే ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందని, కనీసం పట్టించుకునే నాథుడు కరువయ్యారని విమర్శించారు. జగత్ పల్లి రిసార్ట్స్ గిరిజన మ్యూజియం పనులు ప్రారంభించాలని అన్నారు. జీవో నెంబర్ 3కు ప్రభుత్వమే పిటిషన్ వేసి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, బిడ్డిక దమయంతి నాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, సర్పంచ్ అప్పారావు, సుబ్బారావు మొండంగి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి


ప్రజాశక్తి-పాలకొండ

రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి జాప్యం లేకుండా తక్షణమే రైతులకు సొమ్ము చెల్లించాలని, ధాన్యం కొనుగోలు గడువు మార్చి నెలాఖరుకు పెంచాలని, రైతులకు నేటి వరకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌కు అందించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, చేబోదుల లక్ష్మీనారాయణ, శాసపు సుగుణాకర్, జాడ శ్రీధర్, పి.గౌరునాయుడు, కోట సంగంనాయుడు, సిరిపురపు జగదీష్, కరణం వరహాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేరాఫ్ అడ్రస్ వైసిపి పాలన అని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని కోదండరామ కళ్యాణమండపంలో సోమవారం నిర్వహించిన పాచిపెంట మండల సచివాలయం కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల సచివాలయం కన్వీనర్ పి.గౌరీశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు లేవని టిడిపి ప్రచారం చేయడం అబద్ధమన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయని చెప్పారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో నిర్మాణమైన వంతెనలు, రహదారులు అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. గతంలో టిడిపి ప్రభుత్వం మాదిరిగా శంఖుస్థాపన చేసిన అభివృద్ధి పనులు గాలికొదిలేయ లేదన్నారు. పట్టణంలో వందపడకల ఆసుపత్రికి అప్పటి మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు శంకుస్థాపన చేసి వదిలేసిన పార్టీ టిడిపియేనని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వంద పడకల ఆసుపత్రి నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మరింత మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో సిఎం జగన్ మోహన్‌రెడ్డి సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు తోడుగా ఉండేలా గృహ సారథులు, సచివాలయం కన్వీనర్ల నియామకం చేపట్టినట్లు తెలిపారు. అట్టడుగు స్థాయిలో ఏన్న నలుగురు సమన్వయంతో పనిచేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, వైసిపి సీనియర్ నాయకులు పి.చినబాబు, డోల బాబ్జీ, వ్యవసాయ సలహా మండలి మండల ఛైర్మన్ మధుసూదనరావు, మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలు నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని వినతి

మున్సిపల్ కార్మికులకు ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్మికులు డిప్యూటీ సిఎం రాజన్నదొరకి వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌వై నాయుడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన రాజన్నదొరను కలిసి సమస్యలను వివరించారు. మున్సిపల్ కార్మికుల ముఖహాజరుకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు రోజూ ఉదయం 5గంటలకు విధులకు హాజరవుతారని చెప్పారు. కార్మికులకు వైసిపి ఇచ్చిన హామీ లేవీ అమలు కాలేదని చెప్పారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. గత మూడేళ్లుగా కార్మికులకు పంపిణీ చేయాల్సిన సబ్బులు, నూనెలు ఇవ్వలేదన్నారు. ముఖహాజరు నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని కోరారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పామాయిల్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పామాయిల్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని పామాయిల్ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ డిమాండ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పామాయిల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి గెలలు నరికి, లోడింగ్ అన్ లోడింగ్ చేసే కార్మికులను ప్రభుత్వం గుర్తించలేదన్నారు. కార్మికులు గెలలు నారికేటప్పుడు చెట్లుపై పాములు, తేల్లు, జెర్రెలు కరిచి కొంతమంది చనిపోతున్నారన్నారు. 20నుండి 40అడుగుల ఎత్తులో ఉన్న ఇనుపగెడలతో గెలలు కోసినప్పుడు అవి విద్యుత్ తీగలపై పడి షాక్‌కు గురై కొంత మంది చనిపోతున్నారన్నారు. కొంత మంది వికలాంగులు మారి జీవితంలో ఏ పని చేయలేకపోతున్నారన్నారు. కావున ప్రభుత్వం పామాయిల్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత భీమా పథకం వర్తింప చేయాల కోరారు. పామాయిల్ కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో సుమారు నాలుగువేల మంది పామాయిల్ కార్మికులు ఉన్నారని రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలేవీ కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. సాలూరు ఇప్పటికే అనేక మంది వికలాంగులయ్యారన్నారు. కార్మికులకు కూడా నష్టపరిహారాలు, సబ్సిడీలు ఇవ్వాలని, రోజు కూలి వెయ్యి రూపాయలు ఇచ్చేలా చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న కాలంలో కార్మికులందర్నీ కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు , కొల్లి గంగు నాయుడు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పామాయిల్ కార్మికులు

ఉపాధ్యాయ సంఘం కేలండర్ ఆవిష్కరణ

పార్వతిపురం టౌన్ : ఆంధ్రప్రదేశ్ ఎస్సి, ఎస్టి ఉపాధ్యాయ సంఘం రూపొందించిన రాష్ట్ర వాల్ కేలండర్‌ను పార్వతీపురం మన్యం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యారంగ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిఇఒ పి. బ్రహ్మాజీరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం. గయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి బి. సూర్యనారాయణ, ఎస్సి, ఎస్టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ కుటుంబానికి భూదేవి పరామర్శ

సీతంపేట : మండలంలోని బి.కిరప గ్రామంలో వాలంటీర్‌గా పని చేస్తున్న బిడ్డిక రాజ్యలక్ష్మి శనివారం మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను టిడిపి నాయకులు పడాల భూదేవి సోమవారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలి భర్త బిడ్డిక గోపాల్, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ కె. విశ్వనాథం, బిడ్డిక సంజీవరావు, ఉప సర్పంచ్ రాజారావు, నిమ్మక రమేష్, ఆరిక ధర్మారావు, ఊలక రత్నాకర్, సవర కూర్మారావు తదితరులు ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో తనిఖీ

మక్కువ : మండలంలోని సోమవారం ములక్కాయవలస, మక్కువ ఆదర్శ పాఠశాలను అసిస్టెంట్ జిసిడిఒ, స్పెషల్ అడప్షన్ ఆఫీసర్ (సమగ్ర శిక్ష) కె.రోజా రమణి తనిఖీ చేశారు. పాఠశాలలో అన్ని రికార్డులనూ, పరిశీలించిన అనంతరం టీచర్ లెసన్ ప్లాన్స్, టి. డి.ఎస్,ఎస్.ఏ -1 పేపర్స్, సిసిఈ, పిఎంఆర్, స్లో లెర్నర్, యాక్షన్ ప్లాన్, జగనన్న గోరుముద్ద మధ్యాహ్నం భోజనం, తరగతులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలిక వసతిగృహం పరిసరాలు, మెనూ పరిశీలించారు. తరువాత ఉపాధ్యాయ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, ఉపాధ్యేయతర సిబ్బంది పాల్గొన్నారు.

పేపర్లు దిద్దడానికి సమయమివ్వాలి

కలెక్టరేట్ : ఈ నెల 8 నుంచి 10వరకూ ఎఫ్ఎ-3 పరీక్షలు (యూనిట్-3) జరుగుతాయని ఈ పేపర్లను 12వ తారీకులోపు దిద్దాలని, ఆ మార్కుల రిపోర్టును 14లోపు మార్కులు పోస్టు (ఆన్లైన్/ రిజిష్టరు) చేయాలని విద్యాశాఖధికారులు ఆదేశాలు ఇవ్వడాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళి మోహన్ రావు తప్పు బట్టారు. మూడు రోజులు పాట జరిగే పరీక్షల్లో ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా ఉంటారు కాబట్టి ఇన్విజిలేటర్లిగా పని చేస్తూ పేపర్లు ఎలా దిద్దుతారని ప్రశ్నించారు. 11, 12 తారీఖులు రెండవ శనివారం, ఆదివారం ఉన్నాయి కనుక పాఠశాలలకు సెలవు ఉంటుందనీ దీంతో పేపర్లు దిద్దడం ఎట్టి పరిస్థితులల్లోనూ సాధ్యం కాదని చెప్పారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచి మానసిక వేదింపులకు గురి చేయాలని ప్రభుత్వం చూస్తుందని చెప్పారు. పేపర్లు దిద్దడానికి 4 రోజులు సమయం పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఆర్‌టిసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సాలూరు : ఆర్‌టిసిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు సర్క్యులర్ 1/2019ని అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌వై నాయుడు, ప్రయివేటు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు శరత్ డిమాండ్ చేశారు. సోమవారం వారు డిపో ఆవరణలో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులకు ఇచ్చే ఓవర్ టైం, రోజువారీ బస్సు ఆధారిత ఆదాయం అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల కార్మికులకు నష్టమే కానీ పెద్ద గా ప్రయోజనం లేదని చెప్పారు.

11న లోక్ అదాలత్

పాలకొండ రూరల్ : ఈ నెల 11వ తేదిన పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించినునట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎ. విజయ్ రాజ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులు, చెక్కుబౌన్స్ కేసులతో పాటు బ్యాంకు తగాదాలు తదితర కేసులు పరిష్కారం చేసేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.

40మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఎంపిక


ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న అధికారులు

సాలూరు : పట్టణంలోని భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక అవస రాల ఉపకరణా లకు 40మంది ఎంపికయ్యారు. ఎంఇఒ బి.రాజ్ కుమార్ ఆధ్వర్యాన నిర్వహించిన శిబిరంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన 40మంది వికలాంగులు హాజరయ్యారు. మన్యం జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ భానుమూర్తి, వైద్యులు డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఫిజియో థెరపిస్టు పి.సురేష్ పాల్గొన్నారు.

సీతంపేటలో బాలల రక్షణ కమిటీ

సీతంపేట: మండలంలోని మండల బాలల రక్షణ కమిటీ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేశారు. వీటిలో ఎంపిపి నెంబరు కన్వీనర్‌గా వ్యవహరిస్తే సభ్యులుగా తహశీల్దార్, ఎంపిడిఒ, సిడిపిఒ, ఎస్ఐ, ఎంఇఒ, ఎపిఒ, ఎపిఎంలు వ్యవహరిస్తారని ఎంపిడిఒ కె. గీతాంజలి ఒక ప్రకటనలో తెలిపారు. మండల మహిళ అధ్యక్షులు సుశీల హెల్త్ విద్యార్థుల సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

ఉపాధ్యాయుల చేయూత

పాలకొండ : స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో సిఆర్‌పిగా పనిచేస్తున్న కె.రాజు వెన్నుముకకు సంబంధించిన శస్త్ర చికిత్సకు రూ.లక్ష 50వేలు అవసరమని గుర్తించగా ఉపాధ్యాయులు రూ.లక్ష వరకు విరాళాలు పోగుచేసి ఎంఆర్‌సి కార్యాలయానికి అందజేశారు.

క్లాప్ ప్రోగ్రాం పరిశీలన

పాలకొండ : 21వ శతాబ్ద నైపుణ్యాలు, వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇంఆర్‌పి మేనేజర్ ఎ.అనూష పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది మంచి కార్యక్రమమని, దీన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.సూర్యనారాయణ ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

కొమరాడ : మండలంలోని కూనేరు రామభద్రపురం సమీపాన వేసవుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని టిడిపి నాయకురాలు పల్లవిరాజు డిమాండ్ చేశారు. సోమవారం నాగావళి నది పరివాహక ప్రాంతమైన రామభద్రపురం సమీపంలో నుంచి ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూనేరు రామభద్రపురం నదీ ప్రవాహ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా జై ప్రకాష్ పవర్ వెంచర్ ద్వారా ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతుందన్నారు. దీనిపై అనేకసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు గానీ, రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పల్లవిరాజు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


పాలకొండ రూరల్: విద్యార్థినికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాలకొండ రూరల్ : స్థానిక పెదకాపువీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యాధికారి బి.కృష్ణా రావు విద్యార్థులకు పరీక్షలు నిర్వ హించి దృష్టిలోపాలున్న 55 మంది విద్యార్థులను గుర్తించారు. ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జామి రవి, సైన్స్ ఉపాధ్యాయులు అప్పికొండ రామారావు, కెజిఎస్‌ఎంఎస్ ప్రమారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వైద్యాధికారి డాక్టర్ లావణ్య వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చలి గాలిలోనూ, వేసవి ఎండలో తిరగరాదన్నారు. కార్యక్రమంలో వైద్యులు గోపాల్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, నెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సోమవారం మన్యం జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఎం, జనసేన నాయకులు రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో చాలాచోట్ల రైతుల వద్ద ధాన్యం ఉన్నప్పటికీ ప్రభుత్వం లక్ష్యం పూర్తయిందన్న నెపంతో కొనుగోలు ప్రక్రియను నిలిపివేసిందని అన్నారు. దీంతో రైతులు ధాన్యాన్ని ఎవరికి అమ్ముకోవాలో తెలియక ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారని, ఇప్పటికే వ్యవసాయ మదుపుల కోసం బ్యాంకుల వద్ద, వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకున్న రుణాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. జిల్లాలో అనేక చోట్ల ధాన్యం నిల్వలు ఉండగా కొన్నిచోట్ల నూర్పుడి కూడా జరుగుతున్నాయన్నారు. అయినా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిలిపివేయడం దారుణమన్నారు. జనసేన నాయకులు పాలూరి బాబు మాట్లాడుతూ ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని కొంటామని ప్రభుత్వం ఆర్భాటంగా హడావిడి చేసినప్పటికీ, ఇప్పటికీ ప్రతి మండలంలో వేలాది ధాన్యం బస్తాలు నిల్వలు ఉన్నాయన్నారు. జగన్మోహన్ రెడ్డి తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతులు పండించిన ధాన్యాన్ని కొనే సామర్థ్యం కూడా లేకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పునః ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం నాయకులు రైతులతో కలిసి జాయింట్ కలెక్టర్ ఆనంద్‌కు సమస్యను విన్నవిస్తూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, జనసేన నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.


పార్వతీపురం: ధర్నా చేస్తున్న రైతులు

చివరి ధాన్యం గింజ వరకూ కొనాలి

బలిజిపేట : రైతు పండించిన చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వమే కొనాలని, రైతు సంఘం, ఇతర పార్టీ సీనియర్ నాయకులు డిమాండ్ చేస్తూ ఉప తహశీల్దార్ కె. రత్నకుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం పండించినా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంజరాపు సత్యమనాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు మండల పెదపాపినాయడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి బలగ సత్యనారాయణ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలంటే పనిలోంచి తీసేస్తారా..?

ప్రజాశక్తి- సీతానగరం

జీతాలు చెల్లించమంటే పనిలోంచి తీసేస్తామని అధికారులు హుకుం జారీ చేయడం సిగ్గు చేటని సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, గ్రీన్ అంబాసిడర్ల సంఘం అధ్యక్షులు జలుమూరు గౌరీలు అన్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల జీతాల బాధ్యతను పంచాయతీలకు అప్పజెప్పడంతో గత 10 నెలలుగా వారికి జీతాలు ఇవ్వలేదన్నారు. దీనిపై స్పందన కార్యక్రమంలో పిర్యాదు చేసారని, ఇలా ఎవరైనా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే పనిలోంచి తొలగించాలని జిల్లా అధికారులు హుకుం జారీ చేయడం సిగ్గుచేటన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన జిల్లా అధికారులే చిరుద్యోగులపై బెదిరింపులకు పాల్పడడం మంచిది కాదని, అధికారులు తమ తీరును మార్చుకోవాలని, లేకుంటే జిల్లా వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం మండల పంచాయతీ విస్తరణ అధికారి వర్మ సమస్యను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందించారు.

మిశ్రమ పంటల విధానాన్ని అవలంబించాలి

ప్రజాశక్తి- పాచిపెంట

మొక్కజొన్న పంట ఎక్కువగా ఎరువులు గ్రహించే పంట అని ప్రతి సీజన్‌లో అదే పంటను పండించడం వల్ల భూమి నిస్సారం అవుతుందని ఎఒ కొల్లి తిరుపతిరావు అన్నారు. పాంచాలి ఆర్‌బికెలో రైతులతో సోమవారం సమావేశమయ్యారు. రైతులు పంట మార్పిడి విధానాలను అవలంబిస్తూ మిశ్రమ, బహుళ పంటలను పండించాలని అప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని అన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను ఈక్రాప్‌లో నమోదు చేసుకుని ఇకెవైసి చేయించుకోవాలని అన్నారు. పాంచాలి పరిధిలో ఎక్కువగా మొక్కజొన్న, పత్తి పంటలు సాగులో ఉంటాయని పత్తి వరుసల మధ్యలో అపరాలు లేదా చిరుధాన్యాలు వేసుకోవాలని, భూమి ఎక్కువగా సూర్యుని వేడికి లోను కాకూడదని సూచించారు. వీలైనంత వరకు 365 రోజులు ఏదో ఒక పంటతో భూమి కప్పి ఉంచినప్పుడే భూమిలో సేంద్రీయ కర్బనం వృద్ధి చెంది భూమి సారవంతమవుతుందని చెప్పారు. అనేక రకాలైన బ్యాక్టీరియా, వానపాములు వృద్ధి చెందాలంటే భూమి లోపల పొరలు చల్లగా ఉండాలన్నారు. వరి పంటకు నీరు అధికంగా అవసరమని ఒక ఎకరా వరి పంటకు కావలసిన నీటితో సుమారు మూడు ఎకరాల అపరాలు లేదా చిరుధాన్యాలు పండించవచ్చుని ఖర్చు కూడా బాగా తగ్గి అధిక ఆదాయం పొందవచ్చుని తెలిపారు. రైతులు సాగులో ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక మెలకువలను తెలుసుకొని ఖర్చులు తగ్గించుకుని లాభదాయకమైన వ్యవసాయాన్ని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈదుబిల్లి శ్రీను రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ తిరుపతిరావు

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

మధ్యాహ్న భోజన కార్మిక సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎ.పద్మ పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పథకంలో పనిచేస్తున్న కార్మికులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మెనూ చార్జీలకు రూ.20 ఇవ్వాలని, ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, మార్చి నెలలో హాట్ పొంగలి, సాంబార్ బాత్, ఆకుకూర అన్నం తొలగించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని అన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, హైస్కూల్లో పనిచేస్తున్న వారికి వేతనాలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్ ఇవ్వాలని, గ్లౌజులు, మాస్కులు, యాప్రాన్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎం.సావిత్రమ్మ, వి.నారాయణమ్మ, కె. కుమారి, బి. జ్యోతమ్మ, వి. పార్వతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పద్మ

అరసాడలో గడపగడపకు

బలిజిపేట : మండలంలోని అరసాడలో రెండోరోజు సోమవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు ఇంటి ఇంటికి వెళ్లి ప్రజలను వారి గడప వద్దనే కలుసుకొని వారందరికీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకొని వారిలో ఇంకా అర్హత కలిగి ప్రభుత్వ పథకాలు అందకుంటే వారి వివరాలు అధికారులు నమోదు చేయించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులకు రానున్న కాలంలో పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బలిజిపేటలో వైసిపి మండల అధ్యక్షులు పాలవలస మురళి అధ్యక్షతన జరిగిన గృహసారధుల శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయంతో గృహ సారథులు, వాలంటీర్లు కన్వీనర్లుగా పనిచేయాలన్నారు. కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయనతో జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపి వెలిది సాయిరాం, బెవర హేమలత, మండల పార్టీ అధ్యక్షులు పి.మురళీకృష్ణ, గ్రామ సర్పంచ్ పోల సుజాత రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు గుల్ల ప్రభావతి రాజు, పాల్గొన్నారు.

అధిక నిధులు బూటకం

నెల్లిమర్ల: రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని చెప్పుకుంటున్న నాయకులు విభజన హామీలు, ప్రత్యేక హోదా ఎక్కడికి పోయిందో చెప్పాలని సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు కిల్లంపల్లి రామారావు ప్రశ్నించారు. సోమ వారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులకు ఎరువుల్లో సబ్సిడీ కోత విధించి బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్పొరేట్ల ప్రయోజనం కోసం బడ్జెట్ ప్రవేశపెట్టిందని విమర్శించారు. కార్మిక వర్గాన్ని, సంక్షేమాన్ని పట్టించుకోకుండా బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసిందన్నారు. త

విఒఎపై చర్యలు తీసుకోండి

పార్వతీపురంరూరల్ : బ్యాంకుకు డబ్బు చెల్లించని మహిళా సంఘాల విఒఎ పూడి శారదపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పలువురు మహిళా స్వయం సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతి అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తాళ్లబురిడిలో పైడితల్లి మహిళా సంఘం 2021 జనవరి 13న విశాఖ గ్రామీణ బ్యాంక్ ద్వారా 11మంది సభ్యులకు రూ.5 లక్షల 50 వేలు రుణాలిచ్చారన్నారు. 11 మంది సభ్యులకు నెలకు అప్పు రూ.22,000, పొదుపు రూ.2వేలు చొప్పున కట్టడానికి తీర్మానం చేశారని అన్నారు. పెద్దబొండపల్లి విశాఖ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అప్పు చెల్లించాలని విఒఎకు చెప్పారన్నారు. సభ్యుల వద్ద తీసుకున్న డబ్బు పొదుపును 2022 సంవత్సరం ఏప్రిల్ 20 నుంచి మూడు నెలలు కట్టలేదని అన్నారు. అలాగే సంఘ సభ్యురాలు బేత లక్ష్మి డిసెంబర్‌లో కట్టిన డబ్బులు పొదుపు, అప్పు విఒఎ బ్యాంకులో జమ చేయలేదన్నారు. మహిళా సంఘాల సభ్యుల ద్వారా తీసుకున్న డబ్బు తమ అవసరాలకు ఉపయోగించుకొని బ్యాంకుకు కట్టలేదని ఆరోపించారు. అంతేకాక గ్రామంలో పలు సంఘాల వద్ద డబ్బులు తీసుకొని మోసగిస్తున్నారని అన్నారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్‌కు తెలిపినా చర్యలు తీసుకోలేదని అన్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి ఈ సంఘానికి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై మండల మహిళా సమాఖ్య ఎపిఎం సురేష్ వివరణ కోరగా దర్యాప్తు జరుగుతుందన్నారు.

స్పందనకు 51 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 51వినతులొచ్చాయి. సోమవారం స్థానిక పిఒ బి.నవ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ స్పందనలో చిన్నచలం గ్రామానికి చెందిన బాడంగి సురేష్ వారి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, కొండచొర్లంగికి చెందిన లావణ్య సిసి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. దొండమానుగూడకు చెందిన సింహాచలం కంప్యూటర్ కాటా మంజూరు చేయాలని విన్నవించారు. పనసగూడ చెందిన రవణమ్మ టార్పాన్ మంజూరు చేయాలని, నీలం గూడా చెందిన గౌరీ కుట్టు మిషన్ ఇప్పించాలని కోరారు. సీదిగూడకు చెందిన ఆనందరావు దుక్కు మిషన్ మంజూరు చేయాలని, కుంబికి చెందిన కూరంగి రామారావు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కుడ్డపల్లి చెందిన భాస్కరరావు వ్యవసాయ పైప్ లైన్ మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ జి.మురళి, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, సిడిపిఒ రంగులక్ష్మి, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, ఒఎస్‌డి యుగంధర్, ఎఎంఒ పి.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న పిఒ నవ్య

నేడు సచివాలయ భవనం ప్రారంభం

పార్వతీపురంరూరల్ : మండలంలోని తాళ్లబురిడిలో మంగళవారం కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించనున్నారని జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ రూ.40లక్షల నిధులతో నిర్మించిన సచివాలయం ప్రారంభించిన అనంతరం బందలుప్పి, పూట్బురు, జమదాల, తాళ్లబురిడి, డికె పట్నం, డోకిశీల, ములగ, గంగాపురం, సంగంవలస, ఎంఆర్ నగరం సచివాలయాల పరిధిలో గల గృహ సారథులకు, కన్వీనర్లు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

8న వికలాంగులకు పరికరాలు పంపిణీ

పార్వతీపురంరూరల్ : స్థానిక భవిత కేంద్రంలో ఈనెల8న జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో వికలాంగ చిన్నారులకు ఉచిత పరికరాల పంపిణీకి ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎఇఒ పివి ప్రసాద్ తెలిపారు. పార్వతీపురం, గరుగుబిల్లి, కొమరాడ, సీతానగరం, బలిజిపేట మండలాలకు సంబంధించిన ప్రత్యేక అవసరాలు కలిగిన 5-8ఏళ్ల చిన్నారులకు అవసరమయ్యే పరికరాలు ఉచితంగా అందజేస్తారని అన్నారు. అందుకు చిన్నారులతో పాటు వారి తలిదండ్రులు ఆధార్, సదరం, రేషన్‌కార్డు, జెరాక్స్‌లు, 2పాస్‌పోర్టుఫోటోలతో హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మినీ ట్రైన్‌ను ప్రారంభిస్తున్న పిఒ బి.నవ్య

మినీ ట్రైన్ ప్రారంభం

సీతంపేట: స్థానిక ఎన్టీయార్ అడ్వంచర్ పార్కులో చిన్న పిల్లల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన మినీ ట్రైన్‌ను ఐటిడిఎ పిఒ బి.నవ్య సోమవారం ప్రారంభించారు. రూ.3 లక్షలతో మినీ ట్రైన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్కులో ఇప్పటికే చిన్న పిల్లల కోసం అనేక రకాల క్రీడలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పుడు ఏర్పాటు చేసిన ఈ మినీ ట్రైన్ కూడా పిల్లలను మరింత ఆకట్టుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో పార్క్ మేనేజర్ సవరరాజు, ఇతర పార్క్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతరాయుడుపేటలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అనంతరాయుడుపేటలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు మాట్లాడుతూ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత కష్టాలు పెరిగాయన్నారు. రైతులు పండించే ధాన్యం అమ్ముకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయని, సామాన్యుల బతుకులు దుర్భరంగా ఉన్నాయన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కార్యదర్శులు కె.తిరుపతిరావు, ఆర్.వేణునాయుడు, మండల నాయకులు బి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, వి.సూర్యనారాయణ, డి.సింహాచలం, నాయకులు జి.వెంకటనాయుడు, పి.ఉమామహేశ్వరరావు, సింహాచలం, రాముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

మెస్ ఛార్జీలు పెంచాలి : టిడిపి

కురుపాం : వసతి గృహాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని టిడిపి సీనియర్ నాయకులు నందివాడ కృష్ణబాబు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2018లో ఇచ్చిన 3,4 తరగతులకు రూ.1000, 5 నుంచి 10 వ తరగతులకు రూ.1250, ఇంటర్‌కు రూ.1400 మెస్ చార్జీలు ఇప్పటికీ కొనసాగించడం దారుణమన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకే పరిస్థితుల్లో వసతి గృహ సంరక్షకులు విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పించలేక పోతున్నారన్నారు. దీంతో విద్యార్థులు నిరాశ, నిస్పృహలతో చదువులు కొనసాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు ప్రతి ఏటా సరిపడా నోట్ బుక్స్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచే వారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. పెరిగిన నిత్యవసరాలు అనుకూలంగా మెస్ చార్జీలు పెంచాలని, కాస్మోటిక్ చార్జీలు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్నికి డిమాండ్ చేశారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

హుస్సేన్‌పురంలో ఫ్యామిలీ డాక్టర్


వీరఘట్టం : మండలంలోని హుస్సేన్‌పురంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ కాన్సెప్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎస్.తనుజ, ఎ.మానస రక్తపోటు, మధుమేహ, చంటి పిల్లలు, బాలింతలకు, గర్భిణులకు తదితరులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు మంజూరు చేయాలి

పార్వతీపురంటౌన్ : జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు మంజూరు చేయాలని సిపిఐ పి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు జగనన్న ఇళ్ల ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సరిపడడంలేదని, కావున ప్రభుత్వమే ఉచితంగా ఇసుక, కంకర, ఇనుము సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు ఇప్పించాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు, నాయకులు పాల్గొన్నారు.

బిల్లులు మంజూరు చేయాలని వినతి

కురుపాం : నాలుగేళ్ల క్రితం ఇళ్లు కట్టుకొని ఉన్నవారికి బిల్లులు మంజూరు చేయాలని గరుగుబిల్లి మండల టిడిపి కన్వీనర్ అక్కిన మధుసూదనరావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 నుంచి 2019 వరకు మండలంలోని పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఇళ్లు నిర్మించుకున్నారని వారికి ఇంతవరకు బిల్లులు మంజూరు కాలేదన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి బిల్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పురుషోత్తంనాయుడు, పెద్దింటి పూర్ణచంద్రారావు, ఎం.కృష్ణంనాయుడు తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న టిడిపి కన్వీనర్ మధుసూదనరావు


అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

కుష్టు వ్యాధి నివారణ పై మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి హర్ష కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సోమవారం పాఠశాల విద్యార్థులతో కలిసి మొండెంఖల్ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు రాష్ట్రమంతటా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా కుష్టి వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించి కుష్టు వ్యాధి నివారణకు విద్యార్థులు చే ప్రతిజ్ఞ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ బలరాం నాయుడు, నోడల్ ఆఫీసర్ ఎ. నాగేశ్వరరావు, ఈవో సెల్వరాజ్ ఏఎన్ఎంలు ,ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

పార్వతీపురం రూరల్ : నిద్రిస్తున్న సమయంలో మంచం కింద కుంపటి అంటుకోవడంతో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలం కోన గ్రామానికి చెందిన ఆమె టి.పెంటన్నదొర భార్య వెంకటమ్మ చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. సోమవారం రాత్రి తన ఇంట్లో నిద్రిస్తుండగా చలి కోసం ఏర్పాటు చేసిన కుంపటి రాజుకొని మంచానికి అంటుకోవడంతో మంటలు చెలరేగి తీవ్ర గాయాలు పాలైంది. స్పందించిన కుటుంబ సభ్యులు మంగళవారం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

ఏజెన్సీలో విజిలెన్స్ దాడులు

సీతంపేట : మండలంలో మొగదార గ్రామంలో విజిలెన్స్ దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఐ బి. రామారావు పోలీస్ సిబ్బంది కలిసి దాడులు నిర్వహించి 13 క్వింటాల 30 కేజీలు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని సివిల్ సప్లై గోదాంకు అప్పగించారు. సివిల్‌సప్లై డిటి మధుసూదన్‌రావు, విఆర్ఒ పద్మ ఆయన వెంట ఉన్నారు.